క్లుప్తంగా

అరుణాచలేశ్వరస్వామికి విశేష పూజలు



విశేష అలంకరణలో రాచపల్లి అరుణాచలేశ్వరస్వామి

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని రాచపల్లిలో అపిత కుచాంబ సమేత అరుణాచలేశ్వరస్వామి దేవస్థానానికి సోమవారం భక్తులు పోటెత్తారు. పండితులు స్వామివారికి సామూహిక మహా న్యాస పూర్వక రుద్రాభిషేకం, విశేష పూజలు నిర్వహించారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. శ్రీరమణా సేవాశ్రమం వ్యవస్థాకుడు స్వామి రామానంద ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఏలేరు కాలువకు గండి పడకుండా పటిష్ట చర్యలు



జి.కొత్తపల్లిలో ఏలేరు కాలువ గట్టుకు ఇసుక బస్తాలు వేస్తున్న దృశ్యం

శంఖవరం: మండలంలోని ఏలేరు కాలువకు గండి పడకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. జి.కొత్తపల్లి శివారు ఏలేరు కాలువ గట్టు బలహీనంగా ఉండడంతో ఇసుక బస్తాలతో పటిష్ట పరిచారు. సర్పంచ్ ఈగల విజయదుర్గ పర్యవేక్షణలో సిబ్బంది పూడ్చివేత పనులు చేపట్టారు. అనంతరం ఎంపీడీఓ శివ రామకృష్ణ, తహసీల్దార్ పోతురాజు పెదబాపన్నదొర చెరువు, ఏలేరు కాలువను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు, సలహాలు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఐవీ రమణ,వీఆర్వో వాడపల్లి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటిన పంచాయతీ సిబ్బంది



వృద్ధుడిని సంరక్షించి తీసుకువెళుతున్న పంచాయతీ సిబ్బంది

గోకవరం: పంచాయతీ సిబ్బంది మానవత్వం చాటుకున్నారు. స్థానిక ప్రభుత్వాస్పత్రి సమీపంలో రెండు రోజులుగా వర్షంలో తడుస్తూ నిస్సహాయక స్థితిలో ఉన్న వృద్ధుడిని సోమవారం ఉదయం పంచాయతీ సిబ్బంది షెల్టర్ హోంకు తరలించారు. వివరాల్లోకి వెళితే.. ఓ వృద్ధుడు రెండు రోజులుగా ఆస్పత్రి గేటు వద్ద వర్షంలో తడుస్తూ ఉండిపోయాడు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న కార్యదర్శి టంకాల శ్రీనివాస్‌రావు సోమవారం పంచాయతీ సిబ్బంది సహకారంతో గ్రామంలోని షెల్టర్ హోంకు తరలించి సంరక్షించారు. అతను కామరాజుపేటకు చెందిన వ్యక్తిగా గుర్తించినట్టు కార్యదర్శి తెలిపారు.

వరద పీడిత పంచాయతీలకు రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం



పంచాయతీలకు చెక్కులు పంపిణీ చేస్తున్న మాజీ మంత్రి యనమల, ఎమ్మెల్యే నానాజీ

తుని రూరల్: వరదలతో గ్రామాల్లో దెబ్బతిన్న అంతర్గత రహదారులు, పారిశుధ్యాన్ని మెరుగుపర్చి నిధులు సద్వినియోగం చేయాలని మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ అన్నారు. ఇటీవల వరద తాకిడికి గురైన పంచాయతీలకు రూ.లక్ష చొప్పున ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రకటించిన విరాళాన్ని తుని నియోజకవర్గంలో ఏడు పంచాయతీలకు చెక్కుల రూపంలో సోమవారం అందించారు. గెడ్ల బీడు సమీపంలోని సాయి వేదికలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు చెక్కులను ఎమ్మెల్యే పంతం నానాజీ, ఎమ్మెల్సీ యనమల రామకృష్ణుడు అందజేశారు. తుని మండలంలో హంసవరం, హెచ్.కొత్తూరు, టి.తిమ్మాపురం, తొండంగి మండలం కె.పెరుమాళ్లపురం గోపాలపట్నం, రావికంపాడు, కొమ్మనాపల్లి పంచాయతీలకు ఆర్థికసాయం లభించింది. మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్ బాబు, జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల రామస్వామి పాల్గొన్నారు.



టి.తిమ్మాపురంలో ముంపునకు గురైన పత్తి పంట



తుని-నర్సీపట్నం రోడ్డులో ఉధృతంగా ప్రవహిస్తున్న వెదుళ్లగెడ్డ



టి.తిమ్మాపురం-వలసపాకల రహదారిపై ప్రవహిస్తున్న వరద



పెరుమాళ్లపురంలో పర్యటిస్తున్న యనమల కృష్ణుడు

అంతా వరదమయం

- ఏలేరు అదనపు జలాలు దిగువకు విడుదల
- రాజుపాలెం, భూపాలపట్నం గ్రామాల్లో ఏలేరు కాలువ గట్టుకు గండి
- 700 ఎకరాల్లో నీట మునిగిన పంట పొలాలు
- సంఘటన స్థలాన్ని పరిశీలించిన జేసీ, అధికారులు



గోకవరంలో ఉధృతంగా ప్రవహిస్తున్న బురద కాలువ



రాజుపాలెంలో అధికారులకు సూచనలిస్తున్న జేసీ, అధికారులు

కిర్లంపూడి: ఏలేరు ప్రాజెక్ట్ నుంచి సుమారు 20 వేల క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేయడంతో మండలంలోని ఏలేరు కాలువ ఉధృతంగా ప్రవహిస్తోంది. సోమవారం రాత్రి రాజుపాలెంలోని వాలు కాలువ గట్టుకు గండి పడడంతో సుమారు 300 ఏకరాల్లో వరి పంట, ఎస్సైకాలనీని వరద నీరు ముంచెత్తింది. విషయం తెలుసుకున్న పెద్దాపురం ఆర్డీవో సీతారామారావు స్థానిక తహసీల్దార్ జె.చిరంజీవితో కలిసి గండి పడిన గట్టును పరిశీలించారు. ఆర్డీవో ఆదేశాల మేరకు రెవెన్యూ, ఇరిగేషన్ సిబ్బంది గండిని పూడ్చేందుకు ఇసుక మూటలు వేసినా ప్రయోజనం లేకుండా పోయింది. భారీగా వస్తున్న వరద నీటి ప్రవాహానికి వేసిన ఇసుక మూట వేసినట్లే కొట్టుకుపోవడంతో చేసేది ఏమీ లేక అధికారులు ప్రయత్నం విరమించుకున్నారు.

భూపాలపట్నంలో..

భూపాలపట్నంలో ఏలేరు కాలువకు గండి పడడంతో సుమారు 450 ఎకరాల్లో పంట పొలాలు నీట మునిగాయి. రాజుపాలెం నుంచి ముక్కొల్లు వెళ్లే రహదారి పూర్తిగా జలమయం కావడంతో ప్రయాణికుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా గండి పడిన గట్టును పరిశీలించారు. పెరుగుతున్న వరద ఉధృతికి ప్రాణ నష్టం వాటిల్లకుండా ప్రజలను సురక్షిత ప్రదేశాలకు తరలించాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. గంటగంటకూ పెరుగుతున్న వరద ప్రవాహం దృష్ట్యా ఏలేరు కాలవను ఆనుకుని ఉన్న రాజుపాలెం, ముక్కొల్లు గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తహసీల్దార్ చిరంజీవి తెలిపారు. ఏటిపట్టు గ్రామాల ప్రజలు సురక్షిత ప్రదేశాలకు వెళ్లాలని సుచించారు.

ముంపు గ్రామాన్ని సందర్శించిన ఎమ్మెల్యే

మండలంలో నీట మునిగిన పాతకృష్ణవరం గ్రామాన్ని సోమవారం జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సందర్శించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు పాతకృష్ణవరంలోని లోతట్టు ప్రాంతాల ప్రజలను అధికారులు కొత్తకృష్ణవరం ఎంపీయూపీ పాఠశాలకు తరలించి భోజన వసతులు ఏర్పాటు చేశారు.

వంతెనపై నుంచి ప్రవహిస్తున్న వరదనీరు

ఏలేశ్వరం: ఏలేరు కాలువపై నిర్మించిన వంతెన (కాజ్‌వే) సోమవారం మరింతగా ఒరిగిపోయింది. ప్రాజెక్టు నుంచి వరదనీరు దిగువకు విడుదల చేయడంతో వంతెనపై నుంచి ప్రవహిస్తోంది. దీంతో వంతెనపై రాకపోకలు నిలిచిపోయాయి. ప్రస్తుతం వంతెన పరిస్థితి ప్రమాదకరంగా మారింది. ప్రాజెక్టు నుంచి నీటివిడుదల పెరిగితే వంతెన కొట్టుకుపోయే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్టు నుంచి ప్రతి గంటకూ నీటి విడుదల పెంచడంతో వంతెన పరిస్థితి దారుణంగా ఉంది.రాకపోకలు నిలిచిపోవడంతో ఏలేశ్వరం, అప్పన్నపాలెం (పట్టణపరిధిలోని 8వ వార్డు), జగ్గంపేట మండలం ఇర్రిపాక, మామిడాడ, నరేంద్రపట్నం, తదితర గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

జేసీ పరిశీలన

ఏలేశ్వరంలో ఒరిగిపోయిన వంతెనను జేసీ రాహుల్ మీనా పరిశీలించారు. అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. వంతెనపై రాకపోకలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. వంతెన పరిస్థితిని ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు బొదిరెడ్డి గోపి, మూది నారాయణస్వామి, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఎటు చూసినా వరదే..

తుని రూరల్: భారీవర్షాలు, పీబీసీ కెనాల్, పుష్కర కాలువ, తాండవ, పంపా రిజర్వాయర్ల క్రస్ట్ గేట్ల నుంచి విడుదలవుతున్న జలాలతో మండలంలో ఎటుచూసినా వరదనీరు కనిపిస్తోంది. చెరువులు నిండడంతో పొర్లు కట్లపై నుంచి అదనపు జలాలు దిగువకు ప్రవహిస్తున్నాయి. తాండవ జలాలు, కొండగెడ్డలు, పరివాహక ప్రాంతాల నుంచి వచ్చి చేరుతున్న వర్షపు నీటితో తాండవ నది ఉధృతంగా ప్రవహిస్తోంది. పంపా కాలువ పొంగడంతో వరద నీరు టి.తిమ్మాపురం, వలసపాకల మధ్య రహదారిపై ఉధృతంగా ప్రవహిస్తోంది. పంపా వరద నీరుతో ముంపుబారిన పడే అవకాశం ఉన్న జిల్లేడుపాడు, హెచ్.కొత్తూరు గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. అవసరమైతే పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేస్తామని తహసీల్దార్ ప్రసాద్ తెలిపారు. ఆయా గ్రామాల్లో ఎంపీడీఓ రవికుమార్, కార్యదర్శులతో కలసి పర్యటించారు.



గోకవరం మండలం గాదెలపాలెంలో నీట మునిగిన పంట పొలాలు

బురద కాలువకు వరద

గోకవరం: మండలంలో బురద కాలువకు సోమవారం వరద నీరు పోటెత్తింది. ఏజెన్సీలోని గంగవరం మండలంలో సూరంపాలెం ప్రాజెక్టులో నీటి మట్టం పెరగడంతో దిగువ ప్రాంతాలకు బురద కాలువ ద్వారా వెయ్యి క్యూసెక్కుల వరద నీటిని విడిచి పెట్టారు. దీంతో గోకవరం మండలంలో బురదకాలువ వరద నీటితో ఉధృతంగా ప్రవహించింది. దీంతో గాదెలపాలెంలో ఇసుక పల్లివారి చెరువు తూర్పు కళింగ నుంచి బురదకాలువకు నీరు ప్రవహించే కాలువకు గండి పడింది. రంపయర్రంపాలెం, వీరలంకపల్లి, అచ్యుతాపురం తదితర గ్రామాల్లో బురద కాలువ పొంగి పొర్లడంతో పొలాలు నీట మునిగాయి. మండలంలో సుమారు ఎనిమిది గ్రామాల్లో 280 హెక్టార్లలో పొలాలు నీట మునిగినట్టు వ్యవసాయశాఖ అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. ఏజెన్సీలో కురుస్తున్న భారీ వర్షాలకు ఊరకాలువ వరద నీటితో ఉధృతంగా ప్రవహిస్తోంది. సంజీవయ్యనగర్‌లో ఊరకాలువ ఉధృతంగా ప్రవహిస్తున్న ప్రాంతాన్ని ఎంపీడీఓ పద్మజ్యోతి, తహసీల్దార్ సరస్వతి స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఉగ్రరూపం దాల్చిన వెదుళ్లగెడ్డ

కోటనందూరు: మండలంలో కురిసిన భారీ వర్షానికి కాకరాపల్లి శివారు ఉప్పరగూడెం వద్ద వెదుళ్లగెడ్డ సోమవారం ఉగ్రరూపం దాల్చింది. తెల్లవారుజాము నుంచి గెడ్డ తుని-నర్సీపట్నం రోడ్డు పై నుంచి ప్రవహించడంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. కాకినాడ- అనకాపల్లి జిల్లాలను కలిపే ఈ గెడ్డపై ఉన్న బ్రిడ్జికి ఇరువైపులా మధ్యాహ్నం వరకూ కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. ట్రాఫిక్ నిలిచిపోవడంతో ప్రయాణికులు, వాహనచోదలకు తీవ్ర అవస్థలు పడ్డారు. గెడ్డ పరిస్థితిని గంటగంటకూ అధికారులు పరిశీలించారు. ప్రయాణికులెవరూ గెడ్డ దరి చేరకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

200 ఎకరాల్లో నీట మునిగిన పంట

కోటనందూరు: మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు 200 ఎకరాల్లో వరిపంట నీట మునిగింది. మండల వ్యవసాయాధికారు కేజే చంద్రశేఖర్ సోమవారం కొత్తకొట్టాం, అల్లిపూడి, కేఈ చిన్నయ్యపాలెం, కేఏ మల్లవరం, కోటనందూరు, ఎస్సార్‌పేట, భీమవరపుకోట గ్రామాల్లో పర్యటించి నీటమునిగిన పంటలను పరిశీలించారు. వరదనీరు తొలగిన తరువాత పూర్తిస్థాయిలో పంటనష్టాన్ని అంచనా వేస్తామని ఏఓ తెలిపారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, వంకలు

ప్రత్తిపాడు రూరల్: భారీ వర్షాలకు మండలంలోని వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. వేములపాలెం-పెద్దిపాలెం మధ్య ఏటి కాలువ వంతెన పైనుంచి వరద నీరు ప్రవహిస్తోంది. వేములపాలెం, ఇ.గోకవరం, మెట్టచింత, ఉలిగోగుల, వంతాడ తదితర గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ధర్మవరంలో సిద్దాపెద్దకాపుకు చెందిన పుశువుల షెడ్డు ప్రహరీ కూలిపోయింది. పలు గ్రామాల్లో పంట పొలాలు ముంపునకు గురయ్యాయి. వేములపాలెంలో వంతెన పై నుంచి ఉధృతంగా ప్రవహిస్తున్న ఏటి కాలువను జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు.



ఏలేశ్వరంలో వంతెన వద్ద అధికారులను వివరాలు తెలుసుకుంటున్న జేసీ రాహుల్ మీనా



ఇ.గోకవరంలో ఉధృతంగా ప్రవహిస్తున్న ఏటి కాలువ

ఏలేరు కాలువకు గండి

ఏలేశ్వరంలోని ఏలేరు జలాశయం నుంచి విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌కు వెళ్లే ఏలేరు ఎడమ కాలువకు గండి పడింది. ముందుస్తు చర్యల్లో భాగంగా ఇరిగేషన్ అధికారులు గండిని ఇసుకబస్తాలతో పూడ్చివేశారు. చింతలూరు నుంచి పెద్దిపాలెం వరకు ఏలేరు ఎడమ కాలువ పటిష్టతను నియోజకవర్గ ప్రత్యేక అధికారి, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి శ్రీనివాసరావు, ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్ బాబు, ఇతర అధికారులతో కలిసి పరిశీలించారు.

ముంపు ప్రాంతాల్లో పర్యటన

తొండంగి: మండలంలోని పెరుమాళ్లపురం పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో వైఎస్సార్ సీపీ నేత యనమల కృష్ణుడు సోమవారం పర్యటించారు. ఆవులమంద, బుచ్చియ్యపేట, అవల్దార్‌పాడు తదితర గ్రామాల్లో పర్యటించి రైతులు, ప్రజల సమస్యలు తెలుసుకున్నారు.

ఇర్రిపాకలో జ్యోతిర్లింగాల వద్దకు చేరిన వరదనీరు

జగ్గంపేట: మండలంలో ఇర్రిపాక ఏటిగట్టు ప్రాంతంలో వరద ఉధృతి పెరిగింది. సోమవారం సాయంత్రానికి ఏటిగట్టును ప్రతిష్ఠించిన దాద్వశ జ్యోతిర్లింగాల ప్రాంతంలోకి వరదనీరు చేరింది. తహసీల్దార్ జేవీఆర్ రమేష్, ఎంపీడీఓ వసంత కుమార్, ఇతర అధికారులు మామిడాడ, ఇర్రిపాక గ్రామాల్లో వరద పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు.

లోతట్టు గ్రామాల్లో అధికారుల పర్యటన

గండేపల్లి: భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో మండలంలోని లోతట్టు గ్రామాల్లో సోమవారం అధికారులు పర్యటించారు. మండలంలోని పి.నాయకంపల్లి, కె.నాయకంపల్లి, పి.సూరంపాలెం, యర్రంపాలెం గ్రామాలను తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ రామన్ పరిశీలించారు. గ్రామస్థాయి అధికారులతో మాట్లాడి అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

1044 ఎకరాల్లో పంట నష్టం



కొలిమేరులో ముంపునకు గురైన పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

తుని రూరల్: ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు తుని మండలంలో 1044 ఎకరాల్లో వరి, పత్తి పంటలు నీటి మునిగాయి. మండలంలోని కొలిమేరు, డి.పోలవరం, ఎన్.సూరవరం, చామవరం తదితర గ్రామాల్లో సోమవారం వ్యవసాయ సహాయ సంచాలకులు సుంకర బుల్లిబాబు, ఏఓ బి.అశోక్ కుమార్ పర్యటించి నీటి మునిగిన పంటలను పరిశీలించారు. కొలిమేరులో చెరువుకు పండిన గండిని, నీట మునిగిన పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ బుల్లిబాబు మాట్లాడుతూ 790 ఎకరాల్లో వరి, 254 ఎకరాల్లో పత్తి పంటలు ముంపునకు గురైనట్టు తెలిపారు. ముంపు తొలగిన తర్వాత చేపట్టాల్సిన సస్య రక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు.

ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలి

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం



రాజుపాలెంలో గండి పడిన ఏలేరు కాలువను పరిశీలిస్తున్న తోట నరసింహం

కిర్లంపూడి: ఏటిపట్టు గ్రామాల ప్రజలను సురక్షత ప్రాంతాలకు తరలించి, వారికి అన్ని వసతులు కల్పించాలని వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం అన్నారు. ఏలేరు ప్రాజెక్టు నుంచి వరద నీటిని దిగువకు విడుదల చేయడంతో సోమవారం మండలంలోని రాజుపాలెం, ముక్కొల్లు మధ్యలో వాలుకాలువ గట్టుకు గండి పడింది. దీంతో రాజుపాలెంలోని పంట పొలాలు, లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయి. విషయం తెలుసుకున్న తోట నరసింహం గండి పడిన ప్రదేశాన్ని పరిశీలించారు. రెవెన్యూ, ఇరిగేషన్ సిబ్బంది త్వరితగతిన గండిని పూడ్చి పంట, ప్రాణ నష్టం వాటిల్లకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. అనంతరం ముంపునకు గురైన రాజుపాలెం ఎస్సీపేటను, పంట పొలాలను తోట నరసింహం పరిశీలించారు. ఆయన వెంట జోకా శ్రీను, తోట బాబ్జీ, గణేశుల లచ్చబాబు, కరిణి గణేశ్, పసుపులేటి బుజ్జియ్య, గణేశుల అర్జు తదితరులు ఉన్నారు.

తాండవ నీటి విడుదలతో నిలిచిన రాకపోకలు



కోటనందూరులో తాండవనదిపై పరిస్థితిని పరిశీలిస్తున్న సీఐ చెన్నకేశవరావు

కోటనందూరు: తాండవ జలాశయం నుంచి భారీ స్థాయిలో నదికి నీటిని విడుదల చేస్తుండడంతో మండలంలోని తుని-నర్సీపట్నం రోడ్డు, కోటనందూరు, కాకరాపల్లి-అల్లిపూడి గ్రామాలకు పూర్తిగా రాకపోకలు నిలిచిపోయాయి. తాండవనది పరివాహక ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని డీఈఈ అనురాధ సూచించారు. తాండవ పరివాహక గ్రామాలు, అల్లిపూడి, కోటనందూరులో తాండవ బ్రిడ్జిలను తహసీల్దార్ శుభాష్, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ, తుని రూరల్ సీఐ చెన్నకేశవరావు, ఎస్సై రామకృష్ణ పరిశీలించి ప్రజలను అప్రమత్తం చేశారు. ప్రజలెవరూ నది ఒడ్డుకు రాకూడదని హెచ్చరించారు. ప్రభుత్వ యంత్రాగాన్ని, పోలీసులను బ్రిడ్జిల వద్ద మోహరించారు.

ఉగ్ర తాండవం

- ప్రాజెక్టుకు పోటెత్తిన వరద నీరు
- క్రస్ట్ గేట్ల నుంచి దిగువకు నీరు విడుదల
- ప్రజలను అప్రమత్తం చేసిన అధికారులు
- ముంపునకు గురైన పంట పొలాలు



తుని పట్టణంలో ఉధృతంగా ప్రవహిస్తున్న తాండవ నది

తుని: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. తాండవ రిజర్వాయర్ క్యాచ్‌మెంట్ ఏరియాలో విస్తారంగా వర్షాలు కురవడంతో ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో ఇరిగేషన్ అధికారులు ప్రాజెక్టు క్రస్ట్ గేట్లు ఎత్తి 8,931 క్యూసెక్కులు నీటిని కాలువకు వదిలారు. ఎదుళ్లగెడ్డ, ఇతర వాగులు నుంచి నీరు తాండవ నదికి చేరడంతో నీటిమట్టం ప్రమాదకర స్థాయికి చేరింది. పట్టణంలోని రెల్లిపేట, తారకరామా నగర్, ఏటువద్దువీధి, ఇసకలపేట, ఉప్పరగూడెం తదితర లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు. వరద నీరు ప్రవాహాన్ని ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

భారీగా పంటనష్టం

భారీ వర్షాలు, వరదల కారణంగా తుని నియోజకవర్గంలోని మూడు మండలాల్లో ప్రాథమిక అంచనా ప్రకారం 11,935 హెక్టార్లలో వరి, పత్తి పంటలకు నష్టం వాటిల్లింది. తొండంగి మండలంలో 4,900 హెక్టార్లలో వరి, 14.4 హెక్టార్లలో పత్తి, తుని మండలంలో 2510 హెక్టార్లలో వరి, 575 హెక్టార్లలో పత్తి, కోటనందూరు మండలంలో 3950 హెక్టార్లలో వరి పంట నీటి మునిగింది. తుని పట్టణం రెల్లిపేటలోని మున్సిపల్ పాఠశాలలో శిబిరం ఏర్పాటు చేశారు. తహసీల్దార్ ప్రసాదరావు ఆధ్వర్యంలో పునరావాసం ఏర్పాటు చేసి భోజనం సదుపాయాలు కల్పించారు. మున్సిపల్ ఏఈ అభిలాష్, ఇతర అధికారులు సహాయ చర్యలను పర్యవేక్షిస్తున్నారు.

నీటమునిగిన రైల్వే అండర్ పాస్

తాళ్లూరు రైల్వేగేటు వద్ద నిర్మించిన రైల్వే అండర్ పాస్‌లోకి వర్షం నీరు చేరడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. తుని, రౌతులపూడి మండలాల నుంచి తునికి వచ్చే వాహన చోదకులు ఆర్టీసీ కాంప్లెక్స్, రైల్వే ఓవర్ బ్రిడ్జి మీదుగా పట్టణంలోకి వస్తున్నారు. తుని పట్టణ, రూరల్ సీఐలు గీతా రామకృష్ణ, చెన్నకేశవరావు ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా సహాయ చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే యనమల దివ్య అధికారులను ఆదేశించారు.

ముంపు పొలాలను పరిశీలించిన శాస్త్రవేత్తలు

తొండంగి: కుండపోత వర్షాలకు మండలంలోని నీట మునిగిన వరి పొలాలను వ్యవసాయశాఖ శాస్త్రవేత్తల బృందం సోమవారం పరిశీలించింది. మార్టేరుకు చెందిన వ్యవసాయ పరిశోధనా విభాగం శాస్త్రవేత్తలు డాక్టర్ ఎం.సుధారాణి, పీవీ రమేష్‌బాబు, కాకినాడ డాట్ సెంటర్ కో ఆర్డినేటర్ డాక్టర్ యస్.దయాకర్ తదితర అధికారుల బృందం ఎ.కొత్తపల్లి, కోదాడ, కొమ్మనాపల్లి, ఏవీ నగరం, సీతారాంపురం పరిసర ప్రాంతాలను పరిశీలించింది. 1846 హెక్టార్లలో వరి పంట నీట మునిగినట్టు ప్రాథమికంగా అంచనా వేశారు. మండల వ్యవసాయశాఖాధికారి ఎస్.నరసింహం, ఏఈఓ కొప్పన దైవప్రసాద్, గ్రామసచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో తనిఖీలు



బీసీ బాలికల వసతి గృహాన్ని తనిఖీ చేస్తున్న కాకినాడ మొబైల్ కోర్టు మెజిస్ట్రేట్ ఉష లక్ష్మీకుమారి

ప్రత్తిపాడు రూరల్: ప్రత్తిపాడులోని బీసీ బాలికల వసతి గృహాన్ని కాకినాడ మొబైల్ కోర్టు మెజిస్ట్రేట్ ఉష లక్ష్మీకుమారి సోమవారం తనిఖీ చేశారు. రాష్ట్ర హైకోర్టు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఆమె వసతి గృహాన్ని తనిఖీ చేసి పిల్లలకు అందుతున్న సదుపాయాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా హాస్టల్ వార్డెన్ శైలజారాణికి పలు సూచనలు చేశారు. ఆమె వెంట ప్రత్తిపాడు ప్యానెల్ అడ్వకేట్స్ బుగత శివ, అవసరాల దేవి, బొంగులూరు మధుబాబు, కోర్టు సిబ్బంది శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

శంఖవరం: మండలంలోని పి.మల్లాపురం గిరిజన వసతి గృహాన్ని సోమవారం కాకినాడ ఎక్సైజ్ కోర్టు మేజిస్ట్రేట్ నాగ మల్లేశ్వరి తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. తరగతి గదులు, వంట గది, పరిసరాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు, సలహాలు చేశారు. కార్యక్రమంలో ప్రత్తిపాడు ప్యానెల్ అడ్వకేట్ బుగతా శివ,అన్నవరం ఎస్సై వి.కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

సస్య రక్షణ చర్యలు చేపట్టాలి

ఏలేశ్వరం: వర్షాలకు పంటలు నష్టపోకుండా రైతులు సస్య రక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి బి.జ్యోతి సూచించారు. మండలంలోని యర్రవరం, తిరుమాలి గ్రామాల్లో నీట మునిగిన పంటపొలాలను సోమవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాలకు మండలంలోని 304 హెక్టార్లలో పంట పొలాలు నీట మునిగాయన్నారు. వీలైనంత వరకూ పొలంలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. పిలకల దశలో ఉన్న పొలంలో 2 సెంటిమీటర్లు కంటే తక్కువగా నీరు ఉండడం ద్వారా దుబ్బు ఎక్కువ పిలకలు వేస్తుందన్నారు.

పంటల సంరక్షణకు జాగ్రతలు తీసుకోవాలి

గండేపల్లి: అల్పపీడనం ప్రభావంతో కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పలు గ్రామాల్లో పంట పొలాలు నీట మునిగాయి. ముంపులో ఉన్న పంటల రక్షణకు రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి సద్గురుమూర్తి సూచించారు.